క్లుప్తంగా

రేషన్ కార్డు దారులకు ఈకేవైసీ తప్పనిసరి

పార్వతీపురంటౌన్: రేషన్ కార్డు దారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు సంబంధించి 8,16,859 రేషన్ కార్డు దారులలో ఇప్పటివరకు 7,49,481 మంది ఈకెవైసీ చేయించుకున్నారని, 12,318 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు, 668 మంది 80 సంవత్సరాలపై బడిన వారు ఉన్న వారికి అవసరంలేదన్నారు. 54,392మంది రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కార్డు దారులు డీలర్ వద్ద కానీ, ఎండీయూ ఆపరేటర్ వద్ద కానీ ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాని తెలిపారు. ఈకేవైసీ మన రాష్ట్ర పరిధిలో ఎక్కడైనా చేసుకోవచ్చని, ఈకేవైసీ చేయించేందుకు చివరి తేదీ ఈనెల 30 కావున అందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తం

సాలూరు: అగ్నిప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖధికారి రాజారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం సాలూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలం నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదముందని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవించవచ్చు? వాటి నివారణ చర్యలు తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పరిశ్రమ ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలి



జీడి పరిశ్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక

పార్వతీపురంటౌన్: జీడి పరిశ్రమ ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న జీడి పరిశ్రమ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు పండించే జీడి పంట దళారుల పాలు కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టామని, అందులో భాగంగా జిల్లా కేంద్రంలో జీడి పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీసీసీ, ఐటీడీఏ అధికారులు ప్రాల్గొన్నారు.

గిరిశిఖర గర్భిణుల వసతిగృహం తనిఖీ

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతి గృహాన్ని డీఎంహెచ్ఓ భాస్కరరావు తనిఖీ చేశారు. ఈ మేరకు శనివారం వసతిగృహాన్ని పరిశీలించిన ఆయన అక్కడ అందుతున్న వసతి సదుపాయాలపై గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణులకు పండ్లు అందించారు. స్థానిక అంబులెన్స్‌కు రెండు టైర్లు ఆయన ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్ ,నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

పాస్టర్ల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

సాలూరు రూరల్: రన్‌ఫర్ జీసస్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కురుకుట్టి గ్రామం నుంచి మామిడిపల్లి గ్రామం వరకు పాస్టర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైబల్ పాస్టర్స్ ప్రెసిడెంట్ జి.సువార్త రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కేయకూడదన్నారు. మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో 50 బైక్‌లతో పాస్టర్లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

• ఎమ్మెల్యే విజయచంద్ర


స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్:

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించి స్థానిక ప్రజలు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సస్యశ్యామలంగా, ఆరోగ్యవంతంగా ఉండాలన్న ఉద్దేశంతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో ఇ–వేస్ట్ నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

సాలూరు: పట్టణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పలు శాఖలు శనివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేసుకుని స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

పరిసరాలను మెరుగు పర్చుకోవాలి

పార్వతీపురం రూరల్: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి మండల స్థాయి అధికారులతో కలిసి శనివారం ఉదయం మండలంలోని వెంకంపేట గ్రామాన్ని సందర్శించి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొని పరిశుభ్రతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధికారుల సమక్షంలో గ్రామస్తులకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకాధికారిణి సుధారాణి వివరించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథం, వెంకంపేట గ్రామ సర్పంచ్ తీళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పార్వతీపురం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్య సమాజాన్ని రూపొందించవచ్చునని ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. స్వచ్ఛత, శుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతతోనే ఆరోగ్యకర వాతావరణం ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువలో ర్యాలీ


మక్కువలో ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న దృశ్యం

మక్కువ: స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి, మక్కువ ప్రధాన రహదారిలో మూడు రోడ్ల జంక్షన్ వరకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బలిజిపేటలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ చేస్తున్న అధికారులు

ర్యాలీకి జనాలు కరువు

బలిజిపేట: బలిజిపేటలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీకి జనాలు కరువయ్యారు. అధికారులు మొక్కుబడిగా ర్యాలీ నిర్వహించి ఫొటో తీయించేసి మమ అనిపించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన ర్యాలీకి రోడ్డుమీద పోయేవారిని నిల్చోపెట్టి ఫొటో తీయించి మమ అనిపించేశారని పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమం ప్రాధాన్యం ఏమిటి? ర్యాలీ ఎందుకు నిర్వహిస్తున్నారు? ఇంతమంది ర్యాలీలో ఎందుకు పాల్గొన్నారు? ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏం చేయాలనే అంశాలను పక్కనపెట్టి మమ అనిపించేశారు. చిత్తశుద్ధి లేని కార్యక్రమాలను ఎందుకు చేయాలన్న విషయం చర్చనీయాంశమైంది. పూర్తిస్థాయిలో మండలస్థాయి అధికారులైనా హాజరువకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, కార్యదర్శి ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఐటీడీఏ ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది


ఆర్టీసీ కార్యాలయం ఆవరణలో తుప్పలను తొలగిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది


వెంకంపేటలో ర్యాలీలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి

వేతనదారుల దగ్గర చేతివాటం

- వారానికి రూ.100 ఇవ్వాల్సిందే
- జాబ్‌కార్డు దారులు 15,206 మంది
- పనుల్లో పాల్గొంటున్న వారు 14 690 మంది

సీతానగరం: ఎండనక వాననక జీవనోపాధి నిమిత్తం ఉపాధి హామీపనుల్లో పాల్గొనే మండలంలోని వేతనదారుల దగ్గర సంబంధిత అధికార సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు, కూలి పనులు చేసుకుంటున్న వారికి ఉపాధి కల్పించడానికి ఉపాధిహామీ(ఎన్ఆర్ఈజీఎస్) చట్టం ద్వారా పని కల్పించింది. అయితే ఈ చట్టానికి తూట్లుపొడిచే ఇతరత్రా పనులు జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కావాలని 15,206 మంది వేతనదారులు జాబ్‌కార్డులు పొందారు. అందులో 14,690 మంది వేతన దారులు పనుల్లో పాల్గొనగా 10 లక్షల పనిదినాలు కల్పించారు. వ్యవసాయ పనుల్లేక అందరూ పనుల్లో పాల్గొనడం వల్ల వేతనదారులు గిట్టుబాటు వేతనం పొందాలంటే వారానికి ఒక్కో వేతనదారు నుంచి వంద రూపాయలు వసూలు చేస్తున్నట్లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. వారానికి రూ.100 ఇచ్చిన వారికి వేతనం రూ.280 వచ్చేలాగా..రూ.100 ఇవ్వనివారికి వేతనం తగ్గించనున్నట్లు ఉద్యోగులు హెచ్చరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతి శనివారం ఉపాధి పనిచేసిన చోటనే రూ.100 ఇస్తున్నామని వేతనదారులు వాపోతున్నారు. వారానికి రూ.100 ఇస్తున్నవారు ఎవరికైనా చెబితే అటువంటి వారిని మరుసటి రోజునుంచి పనిలోకి రానిచ్చేది లేదని మండల స్థాయి అధికార సిబ్బంది హెచ్చరికలు జారీ చేయడంతో ఎవరికి చెప్పాలో అర్థం కాక చెబితే పని పోతుందేమోనని వేతనదారులు లబోదిబో మంటున్నారు. ఈ విషయమై ఏపీఓ భాను దగ్గర ప్రస్తావించగా వారానికి ఒక్కో వేతనదారు నుంచి రూ.100 వసూలు చేస్తున్నట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సారా వద్దు..జీవితం ముద్దు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ పద్మావతి

సీతానగరం: ప్రజలు సారా తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీతానగరం సర్కిల్ సీఐ డి పద్మావతి హితవు పలికారు. ఈ మేరకు మండలంలోని హనుమాన్ జంక్షన్ వద్ద శనివారం నిర్వహించిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా వల్ల వచ్చే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, గ్రామప్రజలతో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరుగుబిల్లి, సీతానగరం మండలాలకు చెందిన గ్రామాల్లో సారా విక్రయాలు చేసినా ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియ జేశారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్సై ఎంటీ షరీఫ్, సిబ్బంది వెలుగు సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

నేడు ఈస్టర్


ఈస్టర్ పండగ సందర్భంగా ముస్తాబైనపార్వతీపురం పునీతకార్మిక జోజప్ప దేవాలయం

పార్వతీపురం రూరల్: క్రైస్తవ విశ్వాసులు గుడ్‌ఫ్రైడే తరువాత వచ్చే ఆదివారాన్ని ఈస్టర్ పండుగగా ఘనంగా జరుపుకుంటారు. శిలువలో ప్రాణత్యాగం చేసిన యేసుక్రీస్తు చనిపోయిన మూడోరోజు సమాధి నుంచి సజీవంగా తిరిగి లేచారని బైబిల్ ప్రకారం క్రైస్తవ సోదరులు విశ్వసిస్తారు. క్రిస్మస్ తరువాత వారికి అంతటి ప్రాముఖ్యం గల పండగ ఈస్టర్. ఈ పండగకు ముందు 45 రోజుల పాటు తపస్కాలంలో క్రీస్తు శిలువలో మరణించకముందు జరిగిన సంఘటనలను, క్రీస్తు చేసిన అద్భుతాలను గుర్తుచేసుకుంటూ ఉపవాస ప్రార్థనలు, క్రీస్తును స్మరిస్తూ దివ్యక్షేత్రాల ప్రార్థన మందిరాలకు పాదయాత్రలు దీక్షలు వేసి ప్రత్యేక ప్రార్థనలను క్రైస్తవ విశ్వాసులు నిర్వహిస్తారు. శనివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఆదివారం ఉదయం 12గంటల వరకు క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో క్రీస్తు పునరుత్థానాన్ని గుర్తుచేసుకుంటూ పండుగ జరుపుకుంటారు. గడిచిన గత 45 రోజులు ప్రశాంతమైన వాతావరణంలో క్రైస్తం సోదరులు ప్రార్థనలు చేశారు.

రన్ ఫర్ జీసస్

పార్వతీపురంటౌన్: యేసుక్రీస్తు పునరుత్థాన పండగను పురస్కరించుకుని జిల్లా పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం పాతబస్టాండ్ కూడలి నుంచి చర్చి వీధి కూడలి వరకు రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ క్రీస్తు మరణం ప్రపంచ మానవాళి సుఖసంతోషాలతో జీవించడానికేనని అన్నారు. పునరుత్థానుడిగా మళ్లీ లేచి వచ్చి తాను రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా ప్రకటించుకున్నారన్నారు. ఆదివారం జరిగే ఈస్టర్ పండుగను ఆనంద, సంతోషాల మధ్య నిర్వహించుకోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు బిషప్ తిమోధి, రెవరెండ్ సూర్యప్రకాశ్, విజయ్‌కుమార్, సుధీర్ చంద్ర, గోపీ, కుసుమయ్య, జోసెఫ్ క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.


రన ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

ఆందోళన చెందకుండా బయటపడాలి


బహుళ అంతస్తుల్లో జరిగే అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: బహుళ అంతస్తుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఆందోళన చెందకుండా సురక్షితమైన మార్గాల ద్వారా బయట పడాలని పార్వతీపురం అగ్నిమాపక శాఖాధికారి జి. ప్రభాకరరావు అన్నారు. జాతీయ అగ్నిప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో ఉన్న సౌజన్య ఆస్పత్రిలో బహుళ అంతస్తుల్లో సంభవించే ప్రమాదాల నివారణపై ఆస్పత్రి సిబ్బందికి ఆస్పత్రిలో ఉన్న రోగులకు అవగాహన కల్పించారు. ఎత్తైన భవనాల్లో ప్రమాదాలు సంభవిస్తే లిఫ్ట్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోను వెళ్లకుండా మెట్లమార్గం ద్వారా లేదా అత్యవసర మార్గం గుండా మాత్రమే వెళ్లాలని సూచించారు. అగ్నిప్రమాదం వల్ల దట్టమైన పొగ అలుముకున్న సందర్భాల్లో ఆ గదిలో నేలపై పాకుతూ సురక్షితమైన ప్రాంతానికి చేరుకోవాలని, అందుబాటులో ఉంటే తడిగుడ్డను ముక్కుకు కట్టుకుంటే శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ ఎ.రమేష్, ప్రముఖ వైద్యుడు పీబీపీఆర్ నాయుడు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పలగర పంచాయతీలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

బలిజిపేట: నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలు మూసివేసే ప్రక్రియను విరమించుకోవాలని, పేద ప్రజలకు విద్యను దూరం చేయొద్దని సీపీఎం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగర పంచాయతీ గుడివాడ కాలనీలో ఊరుబడిని రక్షించుకుందాం పేరిట ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బి.భానుమూర్తి, మన్మథరావులు మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం వల్ల డ్రాపవుట్స్ పెరిగే ప్రమాదముందన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్‌స్కూల్ పేరుతో విలీనం చేసే ప్రక్రియ వల్ల పాఠశాలల మధ్య దూరం పెరిగి డ్రాపవుట్స్ పెరుగుతాయని సందేహంవ్యక్తం చేశారు. ప్రాథమిక విద్య పూర్తిగా బలహీనపడే విధంగా ప్రభుత్వం నూతన పోకడలను ప్రవేశపెట్టిందన్నారు. పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను రెండింటిని సమాంతరంగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాజన్నదొరకు అభినందనలు


మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు: వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడిగా నియమితులైన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభినందనలు తెలియజేస్తున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడైన రాజన్నదొరకు కీలకమైన భాద్యతలు అప్పగించడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు శనివారం రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కలిసి, దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్‌సీపీ నాయకులు పరిమళ రామకృష్ణ, చింతగడ దాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి కమిటీలు


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు

పార్వతీపురం: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయడం పట్ల బాధితుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈవీనాయుడు, వి. తిరుపతినాయుడు అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీలు క్షేత్రస్థాయి బాధితుల సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం జరిగే విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులను చిన్న కమతాలుగా విభజించి ఖాతాదారులకు పంచడం ద్వారా, ఏదైనా వేలంలో పాల్గొన్న సంస్థలకు సకాలంలో ఆస్తులను అప్పజెప్పడం ద్వారా మేలు చేకూరుతుందన్నారు. ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి అగ్రిగోల్డ్ కేసులన్నింటినీ ఒకే బెంచ్ కిందకు తీసుకువచ్చి రోజువారీ విచారణ జరిగేలా చేస్తే త్వరితగతిన బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు సీపీఐ అండగా ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ తెలిపారు. మండల, నియోజక వర్గ కమిటీలు సమర్థవంతంగా పనిచేసి భవిష్యత్ ఉద్యమాలకు కార్యాచరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.అనంతరావు, పి.ఈశ్వర నారాయణ, ఆర్.ఆదినారాయణ, మురళి, బీటీఆర్ నాయుడు, యశోద తదితరులు పాల్గొన్నారు.

బెవర కృష్ణమూర్తికి రాజన్నదొర పరామర్శ


బెవర కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాచిపెంట: మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త బెవర కృష్ణమూర్తిని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పరామర్శించారు. ఈ మేరకు శనివారం మిర్తివలస గ్రామంలో కృష్ణమూర్తి గృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, పాచిపెంట వీరంనాయుడు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గౌరీశ్వరరావు, దండి కొండలరావు, ఇజ్జాడ అప్పలనాయుడు, రాము,ఉమ, సత్యనారాయణ, మోహన్, వెంకటనాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మక్కువ: విజయనగరంలోని శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మక్కువ మండలంలోని మక్కువ, శంబర, కాశీపట్నం, కవిరిపల్లి, మార్కొండపుట్టి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అక్యే న.శ్రీరామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్, కంటి, ఆర్థో వైద్యులతో ఉచిత పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు అందజేస్తామని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే అతితక్కువ ఖర్చుతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉచిత వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.